వర్షాలతో మొక్కజొన్న కోతలకు ఆటంకం

- బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల్లో కోత దశలో పంట
- మక్కలు వొలిచి విక్రయించుకుంటేనే చేతిలో డబ్బులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు


మోర్తాడ్‌లో కోత దశకు చేరుకున్న మొక్కజొన్న పంట

మోర్తాడ్(బాల్కొండ): బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల్లో ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో మొక్కజొన్న కోతలకు తీవ్ర ఆటంకం కలుగుతుంది.దీంతో పంట కోత దశకు వచ్చిన సమయంలోనే మక్కలు వలవడం, ఆర బోయడం కష్టంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. రెండు, మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మొక్కజొన్న పంటను కోసినా కంకుల నుంచి మక్కలను వేరు చేసే పరిస్థితి లేదు. ఇప్పటికే రైతులు అన్ని పంటలపై పెట్టుబడులు పెట్టడంతో మక్కలు విక్రయించగా వచ్చిన సొమ్ముతోనే ఖర్చులను వెళ్లదీసుకోవడం ఆనవాయితీగా వస్తుంది. దీంతో ప్రస్తుతం మక్కలు విక్రయించే పరిస్థితి కనిపించడం లేదు. కొందరు రైతులు వారం రోజుల కిందనే మొక్కజొన్న కోతలను మొదలు పెట్టారు. వర్షాలతో మక్కలను కంకుల నుంచి వేరు చేయకుండా అలాగే కుప్పలుగా పోసి ఉంచారు. వర్షాలు ఇంకా కురిస్తే మొక్కజొన్న కంకులు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.


పొలంలో కుప్పగా పోసిన మొక్కజొన్న కంకులు

కూలీలు తరలివచ్చినా పనులు లేవు..

మొక్కజొన్న కోతలు మొదలైతున్నాయనే ఉద్దేశ్యంతో మహారాష్ట్ర, మన రాష్ట్రంలోని నిర్మల్, ఆదిలాబాద్, కామారెడ్డి, మెదక్ ప్రాంతాల నుంచి కూలీలు బాల్కొండ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు తరలివచ్చారు. ఈసారి గతంలో కంటే మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరగడంతో తమకు చేతినిండా పని లభిస్తుందనే ఉద్దేశ్యంతో కూలీలు అధిక సంఖ్యలో గ్రామాల్లోకి చేరుకున్నారు. వర్షాలతో మొక్కజొన్న కోతలు నిలచి పని లేకుండా పోయింది.

పింఛన్లు పెంచాలని తహసీల్ కార్యాలయాల ముట్టడి


మాక్లూర్ తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు


వర్నిలో తహసీల్ కార్యాలయం వద్ద ...

సాక్షి, నెట్‌వర్క్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం దివ్యాంగులు, వృద్ధాప్య, బీడీ కార్మికుల పింఛన్లు పెంచాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు.ఈమేరకు ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్, సీపీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం పలుచోట్ల తహసీల్ కార్యాలయాలను ముట్టడించారు. అనంతరం తహసీల్దార్లకు వినతి పత్రాలు సమర్పించారు. రుద్రూర్, వర్నిలో వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్య వంశి మాట్లాడుతూ నిత్యావసర ధరలు విపరీతంగా పెరుగుతున్నందున, చేయూత పింఛన్లు పెంచాలని డిమాండ్ చేశారు.


ఆర్మూర్‌లో డిప్యూటీ తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు


రుద్రూర్ తహసీల్ కార్యాయం ముట్టడికి తరలివస్తున్న దివ్యాంగులు


వేల్పూర్ ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు


సాలూర తహసీల్దార్ ఆఫీస్‌లో ఉద్యోగికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


రెంజల్ తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

క్లుప్తంగా

ఘనంగా ఇంజినీర్స్ డే



బాల్కొండ: మెండోరా మండలం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద, బాల్కొండ మండల కేంద్రంలో పంచాయతీరాజ్ కార్యాలయంలో సోమవారం ఇంజినీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మోక్ష గుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇంజినీర్ల పనితీరును ప్రాజెక్ట్ ఈఈ చక్రపాణి వివరించారు. కార్యక్రమాల్లో డిప్యూటీఈఈ గణేశ్, ఏఈఈలు, పంచాయతీ రాజ్ ఏఈఈ షరీఫ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాళేశ్వర్ ఎత్తిపోతల పథకం నీటి విడుదల

నవీపేట : మండలంలోని నాళేశ్వర్ ఎత్తిపోతల ద్వారా సాగునీటిని సోమవారం చైర్మన్ పుప్పాల భోజన్న విడుదల చేశారు. పథకం పరిధిలో 1000 ఎకరాల సాగు భూములకు నీరు అందించేందుకు నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. గోదావరి వరద ఉధృతికి ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోవడంతో సొంతంగా మరమ్మతులు చేయించామన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ

నందిపేట్ (ఆర్మూర్): మండలంలోని కుద్వాన్‌పూర్ గ్రామంలో సోమవారం మైనారిటీ మండప ప్రహరీ నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు భూమి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్ మాట్లాడుతూ ఎస్డీఎఫ్ నిధుల నుంచి రూ. నాలుగు లక్షలు మంజూరు చేశారని తెలిపారు. నాయకులు తుక్కన్న,గుండు హరీష్, ధర్మన్న, ఇసుబ్, రఫీక్, ముజీబ్, మహేష్, జావీద్ మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

సౌండ్ బాక్స్ వితరణ



వేల్పూర్: వేల్పూర్ మండల కేంద్రంలోని బీసీ కాలనీ ప్రైమరీస్కూలుకు స్థానిక ఫ్రెండ్స్ యూత్ సభ్యులు సౌండ్ బాక్స్, మైక్ సెట్ సోమవారం వితరణ చేశారు. సౌండ్ సిస్టం వల్ల విద్యార్థులు జనగణమన పాడడానికి, నాట్యం నేర్చుకోడానికి సౌకర్యంగా ఉంటుందని హెచ్‌ఎం వరలక్ష్మీ పేర్కొన్నారు. యూత్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. టీచర్లు చంద్రకాంత్, యూత్ సభ్యులు మొండి అశోక్, నవీన్, అశోక్, శేఖర్‌గౌడ్, దినేష్, హరీష్, సతీష్, తేజ, సుకాంత్, చందు, ప్రణయ్, వికాస్ పాల్గొన్నారు.

వేధిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

ఖలీల్‌వాడి: తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని నవీపేట మండలం అల్జాపూర్ గ్రామానికి చెందిన గైని పంచశీల పోలీస్ ప్రజావాణిలో సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తన భర్త లక్ష్మణ్ మృతి చెందగా, తాను ఇద్దరు పిల్లలతో కలిసి జీవిస్తున్నట్లు చెప్పారు. అల్జాపూర్ గ్రామానికి చెందిన సంతోష్ తనను వేధింపులకు గురి చేస్తున్నాడని, రాత్రివేళలో ఫోన్ చేయడం, ఇంటికి వచ్చి అసభ్యంగా ప్రవర్తించడంతో మానసికంగా కుంగిపోతున్నట్లు తెలిపారు. చంపుతానంటూ బెదిరిస్తున్నాడని, ఆ వ్యక్తితో ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పిడుగుపాటుతో దెబ్బతిన్న ఇల్లు



రుద్రూర్: పోతంగల్ మండలం జల్లాపల్లి ఫారంలో పిడుగుపాటుకు షేక్ మసూద్‌కు చెందిన బిల్డింగ్ దెబ్బతింది. ఆదివారం రాత్రి వర్షంతోపాటు పెద్ద శబ్దంతో పిడుగు పడింది. దీంతో భయాందోళనకు గురయ్యామని మసూద్ తెలిపారు. స్లాబ్ పిల్లర్‌పై పిడుగు పడటంతో పెచ్చులూడి, పగుళ్లు వచ్చాయని బాధితుడు పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో గాయాలు

రుద్రూర్: పోతంగల్ మండలం సుంకిని గ్రామానికి చెందిన అభిషేక్ అనే యువకుడు విద్యుత్‌షాక్‌కు గురై చికిత్స పొందుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆదివారం ఆవును మేపుతుండగా తెగిపడ్డ విద్యుత్ తీగ తగిలి షాక్ గురయ్యాడు. క్షతగాత్రున్ని జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కోనేరు శశాంక్ ఆధ్వర్యంలో బాధితుడికి రూ. ఐదు వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

రుణాలు చెల్లించాలి

రుద్రూర్: రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సంఘాభివృద్ధికి సహకరించాలని కోటగిరి సింగిల్ విండో చైర్మన్ కూచి సిద్దు అన్నారు. సొసైటీలో 11 మంది రైతులకు నూతనంగా మంజూరైన రుణాలు రూ. 7,82,500 చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి


క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆర్మూర్: చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ అన్నారు. ఆర్మూర్ మండలం చేపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆర్మూర్ రూరల్ మండల అంతర్ పాఠశాలల టోర్నమెంట్ ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లి దండ్రులు తమ పిల్లలను సెల్ ఫోన్‌లో ఆటలు ఆడటం కాకుండా మైదానంలో ఆటలు ఆడే విధంగా తయారు చేయాలన్నారు. అంతకు ముందు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్‌లో ప్రథమ బహుమతి మగ్గిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ద్వితీయ బహుమతి చేపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తృతీయ బహుమతి సుర్బిర్యాల్, పిప్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు సాధించారు. కార్యక్రమంలో ఎంఈవో రాజ గంగారాం, కన్వీనర్ చేతనకుమారి, ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగాధర్, వివిధ సంఘాల నాయకులు గోపాల్, సంగెం అశోక్, జలంధర్, విద్యాసాగర్ రెడ్డి, మల్లేష్, గోపిరెడ్డి, గోవర్ధన్, కృష్ణారెడ్డి, బాలరాజు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు సారంగి శ్రీకాంత్, రంజిత్ వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మానసికోల్లాసం


ఏకరూప దుస్తులతో విద్యార్థులు

ఆర్మూర్: క్రీడలతో విద్యార్థులకు మానసికోల్లాసం లభిస్తుందని సుర్బిర్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీ.జగదీశ్వర్ మాట్లాడారు. ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్‌లో పాఠశాల విద్యార్థులకు వ్యాపారవేత్త యంసాని అరుణ్ కుమార్ 40 ఏక రూప దుస్తులను విద్యార్థులకు సోమవారం అందజేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భూమేశ్వర్, రమేష్, బాలకృష్ణ ప్రసాద్, సంతోష్, గంగామోహన్, రాజేశ్వర్, బోడ రవి, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో భక్తుల పూజలు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే భక్తులు రామాలయం, అయ్యప్ప ఆలయం, దుర్గామాత, హనుమాన్ ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. అనంతరం నందీశ్వర మహారాజ్ సమక్షంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో సుమన్, పీసీ గంగారెడ్డి, మల్లయ్య, కొంత మంజుల, చరణ్‌రెడ్డి, జిమ్మిరవి, సిద్ధుల గుట్ట సేవ సమితి తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై వర్క్‌షాప్



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ సెల్ అనే అంశంపై విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హైదరాబాద్‌లోని డీమ్డ్ యూనివర్సిటీ రిసోర్స్‌పర్సన్ డాక్టర్ స్వాతి, డాక్టర్ స్వామిబైరి, డాక్టర్ ఉపేందర్‌లు విద్యార్థులకు ఇంగ్లిష్ భాష ప్రాముఖ్యతను వివరించారు. డిగ్రీ తరువాత ఇంటర్వ్యూల సంసిద్ధత, స్కిల్స్‌ను విద్యార్థులకు బోధించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌స్వామి, అధ్యాపకులు, వేణుప్రసాద్, సునీత, యాదగిరి, అంబర్‌సింగ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీడీ పరిశ్రమను జీఎస్టీ నుంచి మినహాయించాలి



వర్ని: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జీఎస్టీ నుంచి బీడీ పరిశ్రమను మినహాయించాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లేశ్ డిమాండ్ చేశారు. సోమవారం మోస్రాలో బీడీ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ఎనిమిది ఏళ్లుగా వస్తు సేవల పన్ను పేరిట ప్రజలపై భారాన్ని మోపుతుందన్నారు. ఈపీఎఫ్ కార్మికులకు రూ. 9 వేల పింఛన్, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీడీ కార్మికులకు రూ.4 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీయూసీఐ నాయకులు బీడీ కమిషన్ ఏజెంట్ గంగాధర్, నాయకులు కళ్యాణి,లలిత, సువర్ణ, విజయ, సావిత్రి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


సాలూరలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో రాజిమంజూష

బోధన్/వేల్పూర్ : విద్యార్థుల భవితను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని సాలూర ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మండల విద్యాశాఖ అధ్వర్యంలో సోమవారం సాలూర మండల విద్యావనరుల కేంద్రంలో మండల స్థాయి ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో రాజిమంజూష ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో రాజిమంజూష మాట్లాడారు. ఎనిమిది మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.ఇటీవల నిర్వహించిన టీ ఎల్‌ఎం లో ప్రతిభ చాటిన ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందించి సత్కరించారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సాయిలు, లక్ష్మణ్, కృష్ణారెడ్డి ,అరుణ్, విఠల్ కాంబ్లే, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వేల్పూర్ మండలం కుకునూర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను స్థానిక హైస్కూలులో ఘనంగా సన్మానించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారం పొందిన గెజిటెడ్ హెచ్‌ఎం టి. హరిచరణ్, తెలుగు స్కూల్ అసిస్టెంట్ పఠాని గంగాధర్, మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడు సీహెచ్ చరణ్‌దాస్‌లను శాలువాతో సన్మానించి, మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో హైస్కూలు, ప్రైమరీస్కూళ్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రమేష్ జాన్


ఆర్మూర్ మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌ను అభినందిస్తున్న సభ్యులు

ఆర్మూర్: ఆర్మూర్ మండల పాస్టర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి పాస్టర్స్ భవన్ లో సోమవారం నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా రమేష్ జాన్, ప్రధాన కార్యదర్శిగా పాస్టర్ దినకరన్ రాజ్ పాల్, కోశాధికారిగా పాస్టర్ మధు లు ఎన్నికయ్యారు. అధ్యక్షుడు రమేష్ జాన్‌ను అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోగా, కార్యదర్శి, ట్రెజరర్లను ఎన్నుకున్నారు. ఎలక్షన్ కమిటీ నిర్వాహకులుగా సునీల్, ప్రభుదాస్, దైవ చిత్తం, ఇమ్మానుయేల్ లు వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రమేష్ జాన్ మాట్లాడుతూ క్రైస్తవ సార్వత్రిక సంఘ క్షేమం కోసం పాటుపడతానన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు కృతజ్ఞతలు తెలిపారు. మండల సంఘ కాపరులు, నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన పదార్థాలను విక్రయించాలి


మామిడిపల్లిలోని ఓ బేకరీలో వస్తువులను పరిశీలిస్తున్న శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని బేకరీ, స్వీట్‌హోంల్లో పరిశుభ్రమైన, నాణ్యమైన పదార్థాలను విక్రయించాలని శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్ వ్యాపారులకు సూచించారు. పట్టణంతో పాటు మామిడిపల్లిలోని డిల్లీ స్వీట్‌హోం, అనూబేకరి, డాల్ఫిన్ బేకరీ, వినాయక బెస్ట్ బేకరీలను తనిఖీ చేసి అందులో విక్రయిస్తున్న పదార్థాలను పరిశీలించారు. కొన్ని బేకరీల్లో ఫంగస్ వచ్చిన బెడ్స్ ప్యాకెట్లను, కాలంచెల్లిన కూల్‌డ్రింక్‌లను గుర్తించి తొలగించారు. అపరిశుభ్రంగా ఉన్న మూడు బేకరీలకు కలిపి అధికారులు రూ.8,500 జరిమానా విధించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని వ్యాపారం చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సురేశ్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమాళి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బకాయిలను విడుదల చేయాలి


సిద్ధార్థ కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్ అన్నారు. ఆర్మూర్‌లో చేపట్టిన డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ కళాశాలల బంద్‌కు పీడీఎస్‌యూ మద్దతు తెలిపింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.8500 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో విద్యార్థులు ఉన్నత చదువులకు ఆటంకం కలుగుతుందన్నారు. వెంటనే బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది విద్యార్థులతో సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడి చేస్తామని హెచ్చరించారు. నాయకులు నిఖిల్, రేశ్వంత్,శీను, విజ్ఞాన్, అనిత, రూప, దివ్య, రుచిత, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలి


నినాదాలు చేస్తున్న నాయకులు

మాక్లూర్: రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలని బీసీ, ఎస్టీ, ఎస్సీల జేఏసీ జిల్లా కన్వీనర్ కోటగిరి రామాగౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన జేఏసీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జనాభాలో మూడో వంతు బీసీ, ఎస్టీ, ఎస్సీలు ఉన్నప్పటికి రాజ్యాధికారం మాత్రం అగ్రవర్ణాలకు చెందినవారే చేపడుతున్నారన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మన ఓట్లు మనమే వేసుకుని మనమే రాజ్యాధికారం చేపట్టాలన్నారు. ఇందుకోసం ప్రణాళికతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జేఏసీ నాయకులు రాజ్‌కుమార్, షేక్ హుస్సేన్, గాండ్ల రాంచందర్, డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సుమన్, జిల్లా అధ్యక్షుడు మహిపాల్, నాయకులు రమేష్, మురళి, కిషన్, సాయిలు, ఒడ్డెన్న, సాయన్న, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


ఘనంగా హిందీ భాష దినోత్సవం


అంక్సాపూర్ హైస్కూల్‌లో బహుమతులు అందుకున్న విద్యార్థులు

వేల్పూర్/బాల్కొండ/ఆర్మూర్ : ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం హిందీ భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేల్పూర్ మండలం అంక్సాపూర్ హైస్కూల్‌లో, బాల్కొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, పెర్కిట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హిందీపై వివిధ రకాల పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు.ఈసందర్భంగా హిందీ టీచర్లను సన్మానించారు. పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

బాన్సువాడ- వర్ని మార్గంలో గంటసేపు నిలిచిన రాకపోకలు



వర్ని: మండలంలోని మల్లారం శివారులోని అటవీ ప్రాంతంలో సోమవారం భారీ వర్షం కురిసింది. వర్షపు నీరు అంతా రోడ్డుపైకి రావడంతో బాన్సువాడ- వర్ని మార్గంలో ఇరువైపులా గంటపాటు రాకపోకలు నిలిచిపోయాయి. వర్షం తగ్గడంతో తిరిగి రాకపోకలు ప్రారంభమయ్యాయి.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వేదిక నిర్వహించబడుతుందన్నారు.

నేడు బోధన్ బల్దియాలో నీటిసరఫరా బంద్

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలో మంగళవారం శక్కర్‌నగర్, హౌజింగ్ బోర్డు కాలనీలకు నీటి సరఫరా బంద్ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. మిషన్ భగీరథ 200 ఎంఎం పైప్‌లైన్ లీకేజీ కారణంగా నీటి సరఫరా నిలిపి వేస్తున్నామన్నారు.

అంగన్‌వాడీల ముందస్తు అరెస్ట్

కమ్మర్‌పల్లి: తమ డిమాండ్ల సాధన కోసం మంత్రుల ఇళ్ల ముట్టడి పిలుపులో భాగంగా పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఇంటి ముట్టడి కార్యక్రమానికి నిజామాబాద్ వెళ్తున్న కమ్మర్‌పల్లి మండల అంగన్‌వాడీ టీచర్లను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండలాధ్యక్షురాలు మంజుల, డివిజన్ నాయకురాలు యమున మాట్లాడారు.

యాత్రా దానానికి చేయూత అందించాలి

బోధన్: ఆర్టీసీ సంస్థ వినూత్నంగా శ్రీకారం చుట్టిన యాత్రా దానం కార్యక్రమం విజయవంతంగా ముందుకు సాగేందుకు స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు చేయూత అందించాలని ఆర్టీసీ బోధన్ డీఎం విశ్వనాథ్ సోమవారం ప్రకటనలో కోరారు.యాత్రా దానంలో భాగంగా తమ డిపో పరిధిలో నిరాశ్రయులైన వృద్ధులు, దివ్యాంగులు, విద్యార్థులకు పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించామని పేర్కొన్నారు. వివరాలకు సెల్ ఫోన్ 9959226001,7382843670 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ఆలూర్ నూతన ఎంపీవో రాజలింగంకు సన్మానం

ఆర్మూర్: ఆలూర్ మండల కేంద్రంలో కొత్తగా మండల పంచాయతీ అధికారి (ఎంపీవో)గా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించిన రాజలింగం ను ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ్, కాంగ్రెస్ నాయకులు రాజలింగంకు శాలువా కప్పి సత్కరించారు.

యూరియా వైఫల్యాన్ని కేంద్రంపై నెడుతున్న కాంగ్రెస్

వేల్పూర్: రైతులకు సరిపడేంత యూరియా సరఫరా చేయలేని వైఫల్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంపై నెడుతోందని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. బాల్కొండ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు వేల్పూర్‌లో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఒక్కో సొసైటీకి 400 బస్తాల యూరియా అవసరం ఉంటే కేవలం 100 బస్తాలు మాత్రమే ఇచ్చారన్నారు.ప్రతిపక్షం అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక తమపై మానాల మోహన్‌రెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

అర్వింద్‌పై ఇష్టానుసారం మాట్లాడడం సరైంది కాదు

వేల్పూర్: ఎంపీ ధర్మపురి అర్వింద్‌పై రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి ఆదివారం వేల్పూర్‌లో ఇష్టానుసారంగా మాట్లాడడం సరైంది కాదని స్థానిక బీజేపీ నాయకులు పేర్కొన్నారు. బీజేపీ బాల్కొండ అసెంబ్లీ కన్వీనర్ మల్కన్నగారి మోహన్, జిల్లా కార్యదర్శి నోముల నర్సారెడ్డి, మండల అధ్యక్షుడు బేల్దారి నవీన్, ఇతర నాయకులు వేల్పూర్‌లో విలేకరులతో మాట్లాడారు. సరిపోయేంత యూరియాను కేంద్రం ఇస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వం తీరుతోనే యూరియా కష్టాలు వస్తున్నాయని ఆరోపించారు.నాయకులు జెల్లప్రవీణ్, బద్దం రాజారెడ్డి, రమేశ్, కృష్ణారెడ్డి, జంగన్న, అన్వేష్ పాల్గొన్నారు.

బోధన్ బల్దియాలో రూ.1.27లక్షల ఆస్తి పన్ను వసూలు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో గల శిశురక్ష ఆస్పత్రి నుంచి రూ.1.27లక్షల ఆస్తి పన్ను బకాయిని సోమవారం బల్దియా కమిషనర్ జాదవ్ కృష్ణ వసూలు చేశారు. వ్యాపారులు బకాయిలు చెల్లించాలని కోరారు.